క్లుప్తంగా

రైతు భరోసా పరిమితి లేకుండా ఇవ్వాలి

మదనాపురం: జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ తరఫున నిర్వహించిన రైతు భరోసా సమావేశం కేవలం వారి పార్టీ కార్యకర్తలకే పరిమితమైందని మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి హాజరు కావాలని వచ్చిన రైతులను, ప్రజలను, ఇతర పార్టీ నాయకులను అనుమతించలేదన్నారు. రైతు భరోసాలో రైతుల అభిప్రాయాలు తీసుకోలేదన్నారు. కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకి జిల్లా రైతుల తరఫున వనపర్తి జిల్లా జెడ్పీటీసీ సభ్యులు అందరూ కూడా రైతు భరోసా కింద ఎకరాకు రూ.7,500, పరిమితి లేకుండా తక్షణం విడుదల చేయాలన్నారు. కౌలు రైతులకు ఇస్తానన్న రూ.15,000 వెంటనే విడుదల చేయాలని, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని, వ్యవసాయ కూలీలకు రూ.12,000 వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. వినతి పత్రం అందజేశామని పేర్కొన్నారు.

పాన్‌గల్ ఎస్‌బీఐ మేనేజర్‌గా నగేష్

పాన్‌గల్: పాన్‌గల్ ఎస్‌బీఐ నూతన మేనేజర్‌గా దాసర్ల నగేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నాగరాజు హైదరాబాద్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో మంచిర్యాల నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. అందుబాటులో ఉంటూ సిబ్బంది తోడ్పాటుతో బ్యాంకు పరిధిలోని ప్రజలు, రైతులకు సేవలు అందిస్తామన్నారు.

మొక్కలు నాటడం ప్రతిఒక్కరి బాధ్యత



కొత్తకోట రూరల్: మొక్కలు నాటడం ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సాగర్ స్నేక్ సొసైటీ వ్యవస్థాపకులు కృష్ణసాగర్ అన్నారు. పెద్దమందడి మండలంలోని జగత్‌పల్లిలో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు గ్రామంలోని ఖాళీ స్థలంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణకు గత నెలలో అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు 256 కిలోమీటర్లు కృష్ణసాగర్ పాదయాత్ర చేస్తూ.. ఎన్‌హెచ్44 రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని కొనసాగిస్తానంటూ ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పిలుపునివ్వడంతో జగత్‌పల్లి గ్రామస్తులు శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతి ఆదివారం జిల్లాలో ఏదో ఒక గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రుడు, వెంకటస్వామి, బాలకృష్ణ, నరేష్‌కుమార్, కుమార్‌సాగర్, విజయ్, రాములు, మధు, కుర్మన్న పాల్గొన్నారు.

యువజన సంఘాల నాయకుల ముందస్తు అరెస్ట్

అమరచింత: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జిల్లా పర్యటన సందర్భంగా మండలంలోని విద్యార్థి, యువజన సంఘాల నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. ఏబీవీపీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయికుమార్, మండల కన్వీనర్ అఖిల్‌తో పాటు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్‌లను శుక్రవారం తెల్లవారుజామున అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచికత్తుతో విడుదల చేసినట్లు ఏఎస్ఐ జమీరుద్దీన్ తెలిపారు. ఈ మేరకు విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షస పాలన కొనసాగిస్తుందన్నారు.

బీజేపీ నాయకులు..



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని పలువురు బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, పంచాయతీరాజ్ సెల్ నాయకులు విక్రం, ఓబీసీ జిల్లా కార్యదర్శి ఆశన్నలను పోలీస్‌స్టేషన్‌లో ఉంచి మధ్యాహ్నం తరువాత వారిని సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

సాగునీరు విడుదలపై హర్షం

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ నుంచి సాగునీరు విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. సాగునీరు విడుదల చేయించాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని రైతులు విన్నవించిన నేపథ్యంలో అధికారులు నీటిని విడుదల చేశారని రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలయజేశారు. ఎడమ కాల్వ పరిధిలోని ఆయకట్టుకు 83 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని పీజేపీ డీఈ నారాయణ తెలియజేశారు.

కూలేందుకు సిద్ధం..

- మండల మహిళా సమాఖ్య భవనం
- రెండు సార్లు భవన నిర్మాణానికి నిధులు వచ్చి వెనక్కి వెళ్లిన వైనం
- కనీస వసుతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలు
- పట్టించుకోని అధికారులు



కూలేందుకు సిద్ధంగా ఉన్న మహిళా సమైక్య భవనం

వీపనగండ్ల: మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేస్తుంది. గ్రామస్థాయిలో మాత్రం మహిళల అవసరాలకు ఉపయోగపడే వాటిని పట్టించుకోవడంలేదు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య నూతన కార్యాలయ భవన నిర్మాణానికి రెండుసార్లు నిధులు మంజూరు చేసిన అధికారులు, భవన నిర్మాణాన్ని చేపట్టలేకపోయారు. దీంతో మండలంలోని పలువురు మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొద్దిపాటి వర్షానికే కూలేందుకు సిద్ధంగా ఉన్న సమాఖ్య భవనాన్ని వెంటనే నిర్మించాలని మండలంలోని మహిళలు కోరుతున్నారు.

14 పంచాయతీల్లో 443 సంఘాలు..

మండలంలోని 14 గ్రామపంచాయతీల్లో మొత్తం గ్రామసంఘాలు 19 ఉండగా, అందులో 443 సంఘాలు ఉన్నాయి. మొత్తం 4,961 మంది సంఘ సభ్యులుగా కొనసాగుతున్నారు. ప్రతి నెల రెండు సార్లు మండల కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసుకునేందుకు సమాఖ్య భవనానికి వస్తుంటారు. దీంతో పాటు మండలంలోని 19 మంది బుక్‌కీపర్లు ఈ భవనంలోనే సమావేశం అవుతుంటారు.



సమాఖ్య భవనంలో ఇలా..

దుస్తులు కుట్టే వీలు లేక..

మండలంలో 26 పాఠశాలలు ఉండగా.. 1,648 మంది విద్యార్థులకు 2 జతల డ్రెస్సులను మహిళా సమాఖ్య ద్వారా తయారు చేయించి విద్యార్థులకు పంపిణీ చేయాల్సి ఉంది. మహిళా సంఘ భవనంలో మామిడికాయల కొనుగోలు కోసం ఉపయోగించే బాక్స్‌లు నిల్వ ఉండటం, కొద్దిపాటి వర్షానికే కార్యాలయం అంతా జలమయం అవ్వడంతో బయట పనిచేసే మహిళలతో డ్రెస్సులు కుట్టించి పంపిణీ చేశారు.

వెనక్కి వెళ్లిన నిధులు..

12 ఏళ్ల కిందట ఆనాటి మంత్రి డీకే అరుణ భారత్ నిర్మాణ్ రాజీవ్‌గాంధీ సేవా కేంద్ర భవనం పేరుతో రూ.25 లక్షల నిర్మాంచాల్సిన ఈ భవనానికి 12 ఏళ్ల కిందట శంకుస్థాపన చేశారు. అంతకు ముందు రూ.16 లక్షలు మంజూరు కాగా.. ఆ డబ్బులు కూడా ల్యాప్స్ అయ్యాయి.

కనికరం చూపాలి



సమాఖ్య కార్యాలయానికి వివిధ గ్రామాల నుంచి వచ్చే మహిళలకు కనీస వసతులు లేవు. కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనంలో భయంభయంతో సమావేశాలు నిర్వహించుకుంటున్నాం. నూతన పదవీ బాధ్యతలు చేపట్టిన మంత్రి జూపల్లి కృష్ణారావు మహిళలపై కనికరం చూపి, మహిళా సంఘం భవనాన్ని నిర్మింపజేయాలి.

– శ్యామల, మండల మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి, వీపనగండ్ల

ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం..



మండల మహిళా సమాఖ్య నూతన భవన నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని ఉన్నతాధికారులకు అవసరమైన నివేదికలు పంపుతాం. భవన నిర్మాణానికి అవసరమైన స్థలం ఉండి నిధులు మంజూరైనా.. కాంట్రాక్టర్లు ఎవరూ భవన నిర్మాణానికి ముందుకు రాకపోవడంతో భవన నిర్మాణం ఆలస్యమైంది. ఉన్నతాధికారులు మరోమారు నిధులు మంజూరు చేయిస్తే భవన నిర్మాణాన్ని పూర్తి చేసి మహిళలకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం.

– శ్రీనివాసారావు, ఎంపీడీఓ వీపనగండ్ల

భారీ వర్షం.. అతలాకుతలం

- విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, నిలిచిన విద్యుత్తు సరఫరా
- గుంతల రోడ్లతో ఇబ్బందులు

ఆత్మకూర్: ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురియడంతో ఆత్మకూర్ అతలాకుతలంగా మారింది. విద్యుత్తు స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రిదాకా వర్షం కురియడంతో ఆత్మకూర్‌లో అంధకారం నెలకొంది, విద్యుత్ స్తంభాలపై చెట్లు విరిగి పడటంతో ట్రాన్స్‌కో సిబ్బంది మరమ్మతు చేపడుతున్నారు. ఆత్మకూర్ మున్సిపాలిటీ కేంద్రంలోని వీధుల్లో రోడ్లన్ని వర్షం నీరు చేరి గుంతలమయంగా మారాయి. స్థానిక గాంధీచౌక్‌లో వర్షపు నీరు భారిగా చేరడంతో వాహనదారులు డ్రెయినేజీలో పడి గాయాలపాలయ్యారు.



ఆత్మకూర్‌లోని గాంధీఛౌక్‌లో రోడ్డులో..



ఆత్మకూర్‌లోని బస్టాండ్ రోడ్డు ఇలా..

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



బునాదిపురం పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం

పెబ్బేరు రూరల్: మండలంలోని బునాదిపురం ప్రాథమికోన్నత పాఠశాలలో సుదీర్ఘ కాలం పాటు పనిచేసిన మైనొద్దీన్, దామోదర్‌బాబు శుక్రవారం సన్మాన సమావేశం ఏర్పాటు చేశారు. ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు, పాఠశాలకు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులు దయానంద్, దుర్గాప్రసాద్‌కు హెచ్ఎం నాగశేషు, ఉపాధ్యాయులు, గ్రామస్తులతో కలిసి శాలువా, పూలమాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు మాజీ సర్పంచ్ గోవిందమ్మ, నరేందర్, వనం రాములు, కరుణాకర్‌గౌడ్, వీరస్వామి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

సగర సంఘం భవనం పూర్తి చేయించాలి



వినతి అందజేస్తున్న సంఘం సభ్యులు

కొత్తకోట: పట్టణ కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న సగర సంఘం భవనాన్ని వెంటనే పూర్తి చేయించాలంటూ కొత్తకోట సగర సంఘం నాయకులు శుక్రవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని కలిసి వినతి అందజేశారు. రూ.9 లక్షల అంచనాతో ఎమ్మెల్యేను సగర సంఘం సభ్యులు కలవడంతో సానుకూలంగా స్పందిస్తూ.. త్వరలో నిధులు మంజూరు చేయించి భవన నిర్మాణానికి పూర్తిగా సహకరిస్తానని ఎమ్మెల్యే చెప్పినట్టు వారు తెలియజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పి.బుచ్చన్న, పి.జనార్దన్, శ్రీనివాసులు, అస్కని శ్రీనివాసులు, చీర్ల యాదయ్యసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుద్ధ్యంతోనే ఆరోగ్యకర జీవితం



అమరచింత నాలుగో వార్డులో అవగాహన కల్పిస్తున్న వైద్యధికారులు

అమరచింత: ప్రజలందరూ తమ ఇళ్ల ముందు, తమ వార్డులను, ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే ఆరోగ్యంగా జీవిస్తామని చైర్‌పర్సన్ మంగమ్మ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఫ్రై డే.. డ్రై డే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని నాలుగో వార్డులోని పలు కాలనీల్లో పర్యటించి మున్సిపల్ సిబ్బందితో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. అదే విధంగా ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతతో కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వానాకాలం ప్రారంభం కావడంతో వర్షపు నీరు నిల్వ ఉండటంతో వాటిలో ఈగలు, దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నురుల్ నదీం, ఆర్ఐ కృష్ణయ్య, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్ గౌడ్, జిల్లా మలేరియా అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరం



పాన్‌గల్ మండలం మాందాపూర్‌లో నిల్వ నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది



నాగల్‌కడ్మూర్‌లో దోమల నివారణకు మందులు పిచికారీ చేయిస్తున్న ఎంపీఓ నరసింహులు

పాన్‌గల్: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉండవచ్చని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. శుక్రవారం డ్రై డేలో భాగంగా మండలంలోని కేతేపల్లి, మాందాపూర్ గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించి పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వారానికి ఒక్కసారి నిల్వ నీటిని పారబోసి నూతన నీటిని పట్టుకోవాలని, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వర్షాకాలం సీజన్ కావడంతో సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. నిల్వ నీటితో దోమలు వృద్ధి చెంది కుట్టడంతో కీటకజనీత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈగలతో అతిసార, కామెర్ల వ్యాధి వచ్చే ప్రమాదం ఉందన్నారు. దీంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నిల్వ నీటిలో అబ్బేట్ ద్రావణాన్ని పిచికారీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంచందర్, సతీష్ పాల్గొన్నారు.

అమరచింత: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీఓ నరసింహులు అన్నారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో శుక్రవారం ఫ్రై డే.. డ్రై డే కార్యక్రమం సందర్భంగా గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల ప్రభావం ఉంటుందని తెలియజేశారు. మురుగు కాల్వలు, మురుగు కుంటలు, దోమల నివారణకు మందులు పిచికారీ చేయించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఆత్మకూర్: పరిసరాల పరిశుభ్రతతోనే అందరికి మేలు చేకూరుతుందని, దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకుని రోగాలను తరిమేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రిరవికుమార్, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. శుక్రవారం ఫ్రై డే డ్రై డే సందర్భంగా 5వ వార్డులో కౌన్సిలర్ పోషన్న ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి ముమ్మరంగా పారుశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, పురపాలిక సిబ్బంది, వైద్యసిబ్బంది ఉన్నారు.

కొత్తకోట రూరల్: ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డేను ప్రతి ఒక్కరూ పాటించాలని కొత్తకోట మున్సిపల్ చైర్‌పర్సన్ పి.సుఖేశిని అన్నారు. డ్రై డే సందర్భంగా పట్టణ కేంద్రంలోని 8వ వార్డులో డ్రై డేను నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడారు. సీజన్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కమిషనర్ ఎస్ఎన్ సూర్యకుమార్, కౌన్సిలర్ చీర్ల నాగన్నసాగర్, మిషేక్, వహిద్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు ఇవ్వాలి



కౌలు రైతుల వివరాలు సేకరిస్తున్న ఏఐకేఎస్ జిల్లా కోశాధికారి వెంకటేష్

అమరచింత: కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు, రైతుభరోసా ఇవ్వాలని ఏఐకేఎస్ జిల్లా కోశాధికారి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అర్హులైన కౌలు రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలంటూ కొంకన్వానిపల్లెలో శుక్రవారం కౌలు రైతుల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో బ్యాంకుల సర్వే ప్రకారం 24 లక్షల మంది కౌలు రైతులు, 35 లక్షల ఎకరాలు సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రకృతి వైపరిత్యాల పరిహారంతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలన్నారు. రైతులకు రుణమాఫీ చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల నాయకులు మహేష్, రాజు, శంకర్, సీతయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థులకు నాసిరకం భోజనం



వనపర్తి ఎస్సీ హాస్టల్‌లో భోజనం పరిశీలిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పెబ్బేరు రూరల్: వనపర్తి ఎస్సీ, ఎస్టీ హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యతలేని, నాసిరకం భోజనం అందిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జ్ రమేష్, గోపాల కృష్ణ విమర్శించారు. జంగిడిపురంలోని ఎస్సీ, ఎస్టీ కళాశాల, పాఠశాలల హాస్టల్స్‌ను సందర్శించగా ఈ విషయం బయటపడిందన్నారు. బియ్యం, పప్పు, కారం తదితర నిత్యావసర సరుకులు నాసిరకంగా ఉన్నాయన్నారు. అన్నం ముక్క వాసన వస్తుందని, పప్పు నీళ్లను తలపిస్తుందన్నారు. కాలం చెల్లిన వస్తువులు, నాణ్యతలేని దినుసులు వాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు ప్రతిరోజూ భోజన వసతులు తనిఖీ చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యత కల్గిన భోజనం అందించాలని, లేకుంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. హాస్టల్స్‌లో విద్యార్థులకు అందిస్తున్న భోజన వసతులపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు గణేష్, అరవింద్, నాని, యశ్వంత్, శివ, చరణ్, బన్నీ, భానుప్రకాష్ పాల్గొన్నారు.

కాల్వ పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి



ఇరిగేషన్ అధికారిణికి వినతిపత్రం అందజేస్తున్న తండా రైతులు

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో కేఎల్ఐ డీ1 కాల్వను పూడ్చి వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఇరిగేషన్ శాఖ జిల్లా అధికారి రమాదేవికి తండా రైతులు వినతి అందజేశారు. ఈ సందర్భంగా తండా రైతులు మాట్లాడారు. తండా రైతులకు సాగునీరు సరఫరా అయ్యే కేఎల్ఐ డీ1 కాల్వను తెల్లరాళ్లపల్లికి చెందిన కాకం రాముడు జేసీబీ సాయంతో అకారణంగా పూడ్చి వేసినట్లు పేర్కొన్నారు. కాల్వ తవ్వకంలో భూమి కోల్పోయిన ఈ రైతుకు 2011 సంవత్సరంలోనే భూ పరిహారం అందినట్లు పేర్కొన్నారు. రైతులకు సాగునీరు అందించే కాల్వను పూడ్చివేసి ఆ భూమిని ఆక్రమించుకున్నట్లు రైతులు పేర్కొన్నారు. కాల్వను పూడ్చివేసిన రైతుపై చర్యలు తీసుకుంటూ తండా రైతులకు సాగునీరు సక్రమంగా అందేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే గిరిజన రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గిరిజన జిల్లా నాయకులు బాల్యనాయక్, రైతులు బాబునాయక్, రవినాయక్, రాములు నాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పరిశీలించాలి



ప్రార్థనలో పాల్గొన్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

పాన్‌గల్: ప్రతి రోజూ విద్యార్థి నోట్‌పుస్తకాలు తప్పక పరిశీలించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని అన్నారం ప్రాథమిక పాఠశాలను ప్రార్థన సమయంలో సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థి, ఉపాధ్యాయుల హాజరు శాతం, విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పక రావాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించేలా హెచ్‌ఎంలు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాధ, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రులకు వినతులు



మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి వినతి అందజేస్తున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి



మంత్రి పొంగులేటికి వినతి అందజేస్తున్న మిషన్ భగీరథ కార్మిక సంఘం నాయకులు

వనపర్తిటౌన్: మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల ఖాళీలను పదోన్నతులతో భర్తీ చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి తెలంగాణ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు టి.మహిపాల్‌రెడ్డి శుక్రవారం జిల్లా కేంద్రంలో వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల పదోన్నతుల్లో వెబ్ కౌన్సెలింగ్‌తో ఆప్షన్స్ ఇవ్వడంతో ఒక్కొక్క ఎస్జీటీ ఉపాధ్యాయుడికి 2, 3 సబ్జెక్టుల్లో స్కూల్ అసిస్టెంట్స్‌గా పదోన్నతి రావడంతో మిగిలిన సబ్జెక్టు పోస్టులు రీలింక్విష్‌మెంట్ ఖాళీలుగా మిగిలాయని చెప్పారు. వనపర్తి జిల్లాలో 49 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. సీనియార్టీ ఉన్న ఎస్జీటీలను పదోన్నతి ద్వారా రీలింక్విష్‌మెంట్‌తో మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

అమరచింత: మిషన్ భగీరథ పథకంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు వెంటనే ప్రభుత్వపరంగా వేతనాలు చెల్లించాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలంటూ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్, జూపల్లి కృష్ణారావుకు మిషన్ భగీరథ కార్మికులు వినతి అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కర్ణాకర్, రఘు మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో పనిచేస్తున్న మిషన్ భగీరథ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. విధి నిర్వహణలో ప్రమాదం జరిగితే రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికులందరికీ టీఏ, డీఏలు రూ.5,000 ఇవ్వాలని కోరినట్లు తెలియజేశారు.

మంత్రులకు వినతి పత్రాలు

పెబ్బేరు రూరల్: మిషన్ భగీరథ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లోని గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని, ఆశాలకు నష్టం కల్గించే పరీక్షా విధానం రద్దు చేస్తూ.. కార్మికులను పలు సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్టు ఎంప్లాయిస్ వర్కింగ్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయ సేకరణకు వచ్చిన రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు. జూపల్లి కృష్ణారావులకు పలు వినతి పత్రాలు అందజేశారు.